నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 1 మార్చి 2024 | NIZAMABAD

ట్రిపుల్ ధమాకా

ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించిన జిల్లావాసులు

సంగీత

వర్ని, ఫిబ్రవరి 29: వర్ని మండలం మల్లారం గ్రామానికి చెందిన బర్మావత్ సంగీత మూడు ఉద్యోగాలకు అర్హత సాధించింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగాల నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకున్నది. ఈ నేపథ్యంలో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోగా అన్ని ఉద్యోగాలకూ ఎంపికైంది. టీజీటీ పోస్టుకు 1:2 ప్రాతిపదికన ఎంపిక కాగా, పీజీటీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు 1:1 ప్రాతిపదికన సెలెక్ట్ అయ్యింది.

గోవూర్ యువకుడు సైతం..

అరవింద్

మోస్రా (చందూర్), ఫిబ్రవరి 29: మోస్రా మండలంలోని గోవూర్ గ్రామానికి చెందిన సుంకె అరవింద్ గురుకుల పీజీటీలో రాష్ట్రస్థాయి ఏడో ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. తాజాగా జూనియర్ లెక్చరర్, టీజీటీలో కూడా అర్హత సాధించాడు. మొత్తం మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికవ్వడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేశారు.

పిట్లం మండలం బండపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి తీర్చాలని కాలనీవాసులు గురువారం రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఐదు రోజులుగా తాగునీరు రావడం లేదని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.
– పిట్లం, ఫిబ్రవరి 29

ఖాళీ బిందెలతో నిరసన

లక్ష్య సాధనకు కష్టపడి చదవాలి

- నర్సింగ్ హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 29: అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే కష్టపడి చదవాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. దేశాయిపేట పరిధిలోని నర్సింగ్ కళాశాల అనుబంధ వసతి గృహాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై కళాశాల ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కళాశాల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. నర్సింగ్ విద్యకు మంచి డిమాండ్ ఉందని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఆయన వెంట పీఏ భగవాన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మొగులయ్య, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

ఇంటర్ సెకండియర్ పరీక్షలు షురూ

కామారెడ్డి/ ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 29: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాల్లో జనరల్ విద్యార్థులు 7190 మంది హాజరు కాగా, 185 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 1012 మంది హాజరుకాగా, 25 మంది గైర్హాజరైనట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ తనిఖీ చేశారు. నిజామాబాద్ జిల్లాలో 16,238 మంది హాజరు కాగా, 723 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రఘురాజ్ తెలిపారు. పట్టణంలోని నిర్మల హృదయ, సీఎస్ఐ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్లను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, మాక్లూర్ ప్రభుత్వ, దాస్‌నగర్‌లోని జ్యోతిబా పూలే, జిల్లా కేంద్రంలోని ఉమెన్స్ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు.

ఎల్లారెడ్డిలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కాంగ్రెస్ పాలనతోనే రైతులకు దుర్గతి

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 29: కాంగ్రెస్ పాలనతోనే రైతులు గ్రామాలను వదిలి పట్టణాలకు వలస వెళ్లాల్సిన దుర్గతి పట్టిందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. విజయసంకల్ప యాత్ర ముగింపు సందర్భంగా నిజామాబాద్ పాత కలెక్టరేట్ మైదానంలో గురువారం నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. తెలంగాణలో రూ.2లక్షల కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. మంచిర్యాల నుంచి ఆర్మూర్ వరకు హైవే రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీలే షుగర్ ఫ్యాక్టరీలను ప్రైవేటుపరం చేసి మూతపడేలా చేశాయని ఆరోపించారు. బీజేపీ యాత్ర ముగింపు సభకు జనాల నుంచి స్పందన కరువైంది. జనాలు లేకపోవడంతో ప్రాంగణం ఖాళీగా దర్శనమిచ్చింది. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేశ్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పాల్గొన్నారు.

గడ్కరీ సభలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

శ్రద్ధగా చదువుకోవాలి..

ఆర్మూర్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి గురువారం పరిశీలించారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని, ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.
– ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 29

నిరుద్యోగులకు శుభవార్త



- కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

కామారెడ్డి/ ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 29: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ డీఎస్సీ కొత్త నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేసింది. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లాకు 601 పోస్టులు, కామారెడ్డి జిల్లాలో 506 పోస్టుల భర్తీకి పచ్చజెండా ఊపింది. నిజామాబాద్ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ 124, లాంగ్వేజ్ పండిట్ 23, పీఈటీ 9, ఎస్జీటీ 403, స్పెషల్ ఎడ్యుకేటర్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ 11, ఎస్జీటీ 31 పోస్టులు ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ 121, లాంగ్వేజ్ పండిట్ 15, పీఈటీ 5, ఎస్జీటీ 318, స్పెషల్ ఎడ్యుకేటర్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ 11, ఎస్జీటీ 36 పోస్టులు భర్తీ కానున్నాయి. తొలిసారిగా స్పెషల్ ఎడ్యుకేటర్ విభాగం కింద నిజామాబాద్‌లో 42, కామారెడ్డిలో 47 పోస్టులను మంజూరు చేసింది. ఈ పోస్టులకు ప్రత్యేక బీఈడీ పూర్తి చేసినవారు అర్హులవుతారు. పాత అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, అవి చెల్లుబాటు అవుతాయని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

ఎన్నికల తర్వాత రేవంత్ ఉండేది డౌటే

- సీఎం సీటును కోమటిరెడ్డి లాక్కుంటారు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో.. ఊడుతుందో?
- నిజామాబాద్ ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు
- కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలంటే చెరుకు రైతులు నామినేషన్లు వేయాలి

బోధన్, ఫిబ్రవరి 29: పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో పోతుందో తెలియదని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి కుర్చీని లాక్కునేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సిద్ధంగా ఉన్నాడని, కోమటిరెడ్డి నుంచి గుంజుకునేందుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాసుకు కూర్చున్నాడని వ్యాఖ్యానించారు. కేసీఆర్ దిగిపోతూ రూ.7 వేల కోట్లు రైతుబంధు నిధులు ఉంచితే.. వాటిని బిల్లుల రూపంలో మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి తీసుకున్నారని మండిపడ్డారు. నిజాం షుగర్స్ పునరుద్ధరణపై కాంగ్రెస్ స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని నిజాం షుగర్స్ ఎదుట చెరుకు రైతులతో గురువారం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో అర్వింద్ మాట్లాడారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ సమస్యపై దేశవ్యాప్త చర్చ కోసం పసుపు రైతుల తరహాలో చెరుకు రైతులంతా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నామినేషన్లు వేయాలని పిలుపునిచ్చారు. నిజాం షుగర్స్ ఫ్యాక్టరీలను నిలబెట్టేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

రైతులను దేవుడే కాపాడాలి..

పార్లమెంట్ ఎన్నికల తర్వాత రేవంత్‌రెడ్డి ఉంటాడో లేదో తెలియదని అర్వింద్ అనుమానం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి నీ ఆర్థిక పరిస్థితి ఏమిటి నీవు చేసిన వాగ్దానాలు ఏమిటి.. అని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ ఎప్పటికీ ఒక్కటి కావని, ఎన్నికల వేళ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. గతంలో కూడా కాంగ్రెస్ హయాంలో నిజాం షుగర్స్‌పై శాసనసభ కమిటీ వేసి కాలయాపన చేశారని గుర్తు చేశారు. నిజాం షుగర్స్‌ను ప్రైవేటీకరణ చేస్తారా.. దీనిపై రూ.400 కోట్లు అయినా సరే పెట్టుబడి పెట్టడానికి చాలామంది రెడీగా ఉన్నారని, ఏదో ఒకటి తేల్చాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అర్వింద్ అన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

ఎండిపోతున్న మక్కజొన్న పంట

- అడుగంటిన భూగర్భ జలాలు
- వట్టిపోతున్న బోరుబావులు
- ఎండిపోతున్న పంటలు

మంగ్లూర్‌లో వట్టిపోతున్న బోరుబావిని చూయిస్తున్న రైతు నారాయణ

యాసంగి బోరుమంటుంది

నిజాంసాగర్, ఫిబ్రవరి 29: బీడువారిన పొలాలు...ఎండిన చెరువులు.. తెగిన చెరువు కట్టలు.. మరమ్మతులకు నోచుకోని చెరువులు.. చుక్కా నీరు పోయని బోర్లు.. ఇదంతా పదేండ్ల కిందట సమైక్యపాలనలోని దుస్థితి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత పదేండ్లపాటు ప్రభుత్వం తీసుకున్న చర్యలతో మండు వేసవిలోనూ నిండుకుండలా చెరువులు మారాయి. పాతాల గంగ బోర్ల నుంచి ఉబికి వచ్చింది. పచ్చని పంటలతో కళకళలాడుతూ దర్శనమిచ్చాయి. కానీ ప్రస్తుతం మళ్లీ పాత రోజులే వచ్చాయి. రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోరుబావులు వట్టిపోతున్నాయి. సాగునీరందక పంటలు చేతికి అందే పరిస్థితి లేకుండా పోతున్నది.

వట్టిపోతున్న బోరుబావులు..

ఒకవైపు చెరువులు ఎండిపోతుండగా మరోవైపు భూగర్భజలాలు సైతం ఇంకిపోతున్నాయి. నెలనెలా నీటి నిల్వలు పడిపోతున్నాయి. గతేడాది జనవరిలో 8.85మీటర్లలో భూగర్భజలాలు ఉండగా ఈ ఏడాది జనవరి నాటికి 10.05 మీటర్లకు పడిపోయింది. కామారెడ్డి జిల్లాలోని మండలాల వారీగా చూస్తే భిక్కనూర్, మాచారెడ్డి, పెద్దకొడప్‌గల్, దోమకొండ, బీబీపేట, నిజాంసాగర్ మండలాల్లో భూగర్భ జలాలు మరింత పడిపోతుండడంతో బోరుబావులు వట్టిపోతున్నాయి. ఫిబ్రవరిలోనే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో మరింత క్షీణించే అవకాశం ఉన్నది. ఇప్పటికే చాలా గ్రామాల్లో బోరు మోటర్లు ఆగుతూ పోస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలో యాసంగిలో సైతం అధిక శాతం వరి సాగు చేస్తున్నారు. భూగర్భ జలమట్టం రోజురోజుకూ పడిపోతుండడంతో బోరుబావుల నుంచి నీరు రాక కండ్ల ముందే పంటలు ఎండుతున్నాయి. నిజాంసాగర్ మండలంలోని మంగ్లూర్, నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామాల్లో ఇప్పటికే చాలావరకు బోరుబావులు వట్టిపోయాయి.

పంటలు ఎండుతున్నాయి..

రూ.లక్ష పెట్టి ఆరు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాను. నాలుగు ఎకరాల్లో జొన్న, రెండు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. మూడో బోరుబావులు ఉండగా ప్రస్తుతం రెండు మాత్రమే నీటిని అందిస్తున్నాయి. అందులో ఒక బోరు పది రోజుల నుంచి ఆగుతూ నీళ్లు పోస్తున్నది. రోజుకు ఎకరం పొలానికి కూడా నీరందడం లేదు. మరో నెల రోజులు గడిస్తే పంట చేతికి అందేలా లేదు. కౌలు డబ్బులతోపాటు పెట్టుబడి డబ్బులు కూడా చేతికి వస్తాయనే నమ్మకం లేదు.

- సుబ్బురి నారాయణ, రైతు, నర్సింగ్‌రావ్‌పల్లి

అప్పులు మిగిలేలా ఉన్నాయి..

నాకు నాలుగు ఎకరాల పొలం ఉన్నది. మూడు బోర్లు ఉండగా, ఒకదాంట్లో పూర్తిగా నీరు రావడం లేదు. మిగిలిన బోర్లు కూడా ఆపుతూ పోస్తుండడంతో వరి పంటకు నీరు సరిపోవడం లేదు. మార్చి, ఏప్రిల్‌లో పరిస్థితి ఎలా ఉంటుందో. పంట చేతికి అందేలా కనిపించడం లేదు. రూ.60వేల వరకు పెట్టుబడి పెట్టిన. చేతికి అప్పులే మిగిలేటట్లు కనిపిస్తున్నది.

- గూల నాగయ్య, రైతు, మంగ్లూర్

రోజురోజుకూ అడుగంటుతున్నాయి...

జిల్లాలో భూగర్భజలాలు రోజురోజుకూ అడుగంటిపోతున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో మరింత అడుగంటిపోయే ప్రమాదం ఉన్నది. జనవరి నుంచి ఇప్పటి వరకు 1.65మీటర్ల లోతుకు పడిపోవడంతో బోరుబావుల్లో నీటి లభ్యత క్షీణించే ప్రమాదం ఉన్నది. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదు కావడం, యాసంగిలో వరి సాగు అధికంగా సాగు చేయడమూ ఒక కారణమే.

- సతీశ్ యాదవ్, జిల్లా భూగర్భ జలశాఖ అధికారి

మెట్ల బావిని పునరుద్ధరిస్తాం..

- యువత శ్రమదానం చేయాలి
- కలెక్టర్ జితేశ్ పాటిల్

ఎల్లారెడ్డి/రామారెడ్డి, ఫిబ్రవరి 29: వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవడం అందరి బాధ్యతని, ఎల్లారెడ్డిలోని మెట్ల బావిని పునరుద్ధరిస్తామని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. మెట్లబావిని గురువారం కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. సుమారు 380 ఏండ్ల క్రితం నిర్మించిన బావి శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని బాగుచేసి మంచి నీటిని నిల్వ చేసుకునేలా తయారు చేస్తామన్నారు. బావులను బాగు చేసేందుకు రూ.50వేలు మంజూరు చేశారు. మెట్లబావి పునరుద్ధరణకు మార్చి 3న శ్రమదానం చేయాలని, పట్టణంలోని యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట రెయిన్ వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ కల్పనారమేశ్, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ సిద్దార్థ ముఖర్జీ, తహసీల్దార్ మహేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, ఆలయ ధర్మకర్తలు సిద్ధి శ్రీధర్, రాజేశ్వర్, సూర్య ప్రకాశ్ ఉన్నారు.

చేపల కుంట పరిశీలన..

రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో ఐకేపీ రుణంతో ఏర్పాటు చేసిన చేపల కుంటను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ గురువారం పరిశీలించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఇలాంటి వాణిజ్య పంటలు అవసరమని చెప్పారు. నిర్వాహకులు లక్ష్మీఆనంద్ దంపతులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఆర్డీవో చందర్‌నాయక్, మత్స్యశాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమేశ్ బాబు, ఎంపీడీవో సవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో శిథిలావస్థకు చేరుకున్న మెట్లబావి, మెట్లబావిని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్(ఇన్‌సెట్‌లో..)